# మనుషులూ — మమతలూ

అమ్మా, మనపొరుగింట్లో దిగుతున్నారే వాళ్లు... ఆయన లెక్చరర్ గారంట అమ్మా — వాళ్లు — ఆంటీ మన చిన్నపిన్నంత ఉంటుందమ్మా — ఆమె! లెక్చరర్ గారి భార్య అంట.' అని ఇంకేదో చెప్పబోయాడు. కాని చెప్పలేక కూర్చున్నాడు కరుణ అమ్మ ఎదురుగా.

అమ్మ తోటకూర కడుగుతున్నది. పక్కనే వత్తుల స్టౌ మండుతున్నది. సాయంత్రం వంట చేసుకోవటంలో ఉంది అమ్మ. కాలేజీ నించి వచ్చాను. ఇంకా ముఖమన్నా కడుక్కోలేదు. వాడి గొంతు వినీ వినటంతోనే ఏమిటా అని వెళ్లాను.

'అమ్మా, ఒకమ్మాయి ఉందే. వాళ్ల అమ్మాయేనంట' అన్నాడు నేను బాత్‌రూం వేపు వెళ్లటం చూసి.

దాంతో అందమైన ఆలోచన ఒకటి తట్టింది నాకు. ఆ అమ్మాయి వీడిక్లాసే అయితేనో! రోజూ అమ్మాయి వీడిని పిలవటానికి వస్తేనో! ఆడ పిల్లలంటే వీడికి తగని సిగ్గు. ఆ సిగ్గు పోగొట్టానికి పెద్దన్నయ్య చెయ్యని ప్రయత్నమంటూ లేదు.

రెండోదినం ఆ అమ్మాయిని కరుణ బడిలోనే చేర్చాలనుకుంటున్నారని ఆ పక్కింటి రాధమ్మ చెపితే నాకు సంతోషంగా ఉంది. ఆ రోజే ఆ ఇల్లాలు 'ఏమండీ' అంటూ ఇంటికి వచ్చారు. వరండాలో కూర్చుని రజనీ నేనూ మాటాడు కుంటున్నాము. అప్పుడే వచ్చాం కాలేజినించి.

'అమ్మగారున్నారా?' అని ఆమె బయట వాకిట నుంచుని అడిగారు.

'ఉన్నారండీ, రండి' అని అమ్మతో పరిచయం చేశాను తీసుకుపోయి.

ఆ కొత్తవారిని చూసి 'ఎవరు?' అంది రజని.

'పొరుగింట్లో దిగారు. నిన్ననే'

'ఏం చేస్తున్నారంట?'

చెప్పాను ——

అంతలో స్కూల్‌నించి బాబ్జీ, కరుణ, నాని, ప్రసాదు, శ్రీను, స్వామి అంతా వచ్చారు. వాళ్లంతా కరుణ క్లాస్‌మేట్సు. కబుర్లు చెప్పు కుంటున్నారు.

'అక్కయ్యా, పక్కింటిలో దిగారే —— ఆ అమ్మాయిని మా స్కూల్లోనే చేర్చారు. మా క్లాసే' అన్నాడు బాబ్జీ.

బాబ్జీ ఎవరి గురించి చెపుతున్నాడో నాకు తెలుసు. అయినా అడిగి తెలుసుకోవాలని 'ఎవరు?' అన్నాను.

బాబ్జీ మళ్లీ విసుక్కోకుండా చెప్పాడు.

'మీ క్లాసేనా?'

'ఆ'

'ఆ అమ్మాయి బెజవాడలోనే చదువుతుండేదంట.' అని తెలిసిన సంగతులే తలో మాట గొడవచేసి చెప్పారు.

అంతవరకు తలదించుకుని రాసుకుంటున్న పెద్దన్నయ్య పక్కకి తిరిగి, కరుణవేపు చూసి 'ఇంకేం?' అన్నాడు.

కరుణ స్నేహితులంతా వెళ్లిపోతామని చెప్పటంతో వెధవ వినలేదేమోనని వాళ్లు వెళ్లిపోయాకా మళ్లీ 'జత దొరికిందిరా నీకు' అన్నాడు పెద్దన్నయ్య.

'పో రౌడీ' అనేసి అమ్మ దగ్గరికి వంటగదిలోకి వెళ్లిపోయాడు కరుణ.

ఎప్పుడన్నా కరుణని ఏడిపించాలనుకుంటే మా పెద్దన్నయ్య రెండు బాణాలు ఉపయోగిస్తాడు. ఒకటి —— బస్సు. రెండు —— చిన్న కోడలు. బస్సు సంగతేమిటంటే ఓ రోజు ఇద్దరూ బస్సులో వస్తున్నారట. అంతలో ఓ పాప

ఎక్కిందంట. కరుణ పక్క సీటు కాళీగా ఉందంట. ఆ అమ్మాయి చక్కా వచ్చి వాడి పక్కనే కూర్చుందంట. పెద్దన్నయ్య వాడి కళ్లల్లోకి చూశాడట. దాంతో కరుణకి సిగ్గేసి లేచి నుంచున్నాడట. ఆ సంగతి పెద్దన్నయ్య భోంచేస్తున్న సమయంలో చెప్పాడు. కరుణ తింటున్నవాడల్లా తినటం మానేసి ఏడవటం మొదలు పెట్టాడు వెధవాయి. అసలే వాడివి గుండ్రని పెద్ద కళ్లు. ఆ కళ్లల్లోకి దుఃఖం చేరితే అమ్మ భరించలేదు. పెద్దన్నయ్యని గట్టిగా తిట్టింది. 'సౌందర్యని గురించి నీలాకాదు' అంది.

మా పెద్దన్నయ్య కథలు రాస్తాడు. వాడి కథలన్నిటిలోనూ సౌందర్య ఉంటుంది. ఆ కథకూ, సౌందర్యకూ సంబంధం లేకపోయినా సరే. అంచేత మేము 'పెద్దన్నయ్యా! ఈసారి నీ కథలో సౌందర్య అవతారమేమిట్రా' అని హాస్యం పట్టిస్తాము.

కరుణ మరీ అల్లరి పనులు చేయటం ఆరంభిస్తే పెద్దన్నయ్య మెల్లగా అమ్మ దగ్గరికి వెళ్లి, 'అమ్మా ఈరోజు మన సీతారామయ్య గారింట్లో ఓ అమ్మాయిని చూశానూ. మన చిన్నకోడలయితే" కరుణకి వినిపించేట్టు చెపుతాడు. దాంతో కరుణ అల్లరి తగ్గనన్నా తగ్గుతుంది, లేదా హెచ్చుననన్నా హెచ్చుతుంది.

'రౌడీవాడికి ఆ మాటల కంటే యింకేం తెల్సు?' అని కళ్లల్లో కోపం ప్రకటిస్తాడు.

మూడోరోజున ఆ లెక్చరర్‌గారమ్మాయి చంకన పుస్తకాలసంచి వేలాడేసుకొని, గేటు దగ్గర నుంచుని 'కరుణా, కరుణా' అని పిలిచింది. కరుణ అమ్మ దగ్గర వంటగదిలో ఉన్నాడు. పాలు తాగుతున్నాడల్లే ఉంది. ఇదే మంచి అదననుకుని ----

'రా పాపా' అని లోపలికి పిలిచి, 'లోపలున్నాడు' అని చెప్పాను.

పాప వరండాలోకి వచ్చి నుంచున్నది.

'నీ పేరు?'

'కమల'

'ఏ క్లాసు?'

'ఆరు' అని 'మీ కరుణా నేనూ ఒకే క్లాసు' ఇంకా స్పష్టంగా ఉండాలని చెప్పింది.

గొంతు ఖంగుమంటున్నది.

'ఇంతకు పూర్వం మీ నాన్నగారెక్కడుండేవారు?'

'ఇక్కడేనండి'

'మరి నువ్వో?'

'మా పిన్ని దగ్గరుండేదాన్నండీ' అంది.

'సరే, లోపలి కెళ్లి పిలువ్ పాపా' అన్నాను.

రెండో జడ అల్లుకుంటున్నాను. ఒకసారి అద్దం ముందుకు ——

వాళ్లబడి ఎనిమిదికే. అంచేత తొందరగా తెల్లారే తయారవాలి.

కమల పావురంలా లోపలికెళ్లి 'కరుణా' అని పిలిచింది. ఏం జరుగుతుందో చూడాలనిపించి మెల్లగా నేనూ వెళ్లాను. కరుణ ముఖం చూద్దును గదా. తెల్లబోయింది. పెద్దన్నయ్య బాత్‌రూం నించి అప్పుడే వస్తున్నాడు. ఒక క్షణం పాటు చూసి ——

'నీ పేరేమిటి పాపా?'

చెప్పింది.

'అయితే కమలా ఒకమాట చెపుతావిను. రోజూ నువ్వూ కరుణా కలిసి బడికి పోతూండండి. మా కరుణకు ఒంటరిగా పోవడం భయం. అందుకే నీతో చెపుతున్నా.' అన్నాడు.

పెద్దన్నయ్య మాటలకి కరుణలో అసహనభావం రేగింది. కరుణ నోరెత్తలేదు. ఎదురుగ్గా ఆ అమ్మాయి ఉంది. అందుకు.

'అట్లాగేనండి' అని పెద్దన్నయ్య సలహా స్వీకరించి, 'కరుణా రా వేళవుతోంది' అని పిలిచింది. స్వచ్ఛమైన ఆ పిలుపులో ఏ సందేహాలూ లేవు. వీణ మీటితే పలికిన రాగాలు. అంతే. కొత్తవాళ్లతో మాటాడాలంటే నాకు ఎన్ని సందేహాలు ముసురుకొస్తాయని!

కరుణ మారుమాటాడకుండా బడికి వెళ్లిపోయాడు కమలతోపాటు.

సాయంత్రం కాలేజీనించి నేను తిరిగి వచ్చేసరికి ఇంట్లో చిన్న ఎత్తున యుద్ధం జరుగుతున్నది. ఈ ఉదయం ఫార్సంతా రజనితో చెప్పా. అది నవ్వుతున్నది. ఆ నవ్వులతోనే వంట గదివేపు వెళ్లాం.

'ఆ రౌడీవాడెందుకట్లా అనాలి?' హుంకరిస్తున్నాడు కరుణ. అమ్మ, 'వాడు రానీరా. వాడికి పెట్టాల్సిన గడ్డి పెడతాను. వెధవాయ్‌కి వీడి వూసెందుకో?' అని పెద్దన్నయ్యని నిజంగానే తిట్టున్నది అమ్మ.

అంతలో చిన్నన్నయ్య వచ్చాడు. వీడు తామరాకు మీది నీటిబొట్టు. మూడో యేడు మెడిసన్ చదువుతున్నాడు. వాడి స్నేహితులు, వాడి చదువులు వాడి గొడవేదో వాడిది తప్ప మా జోలికి రాడు. 'అచ్చం వాళ్ల నాన్న పోలికే' అంటుంది అమ్మ. చిన్నన్నయ్య వచ్చి తనే ఇంత టిఫిన్ గబగబా ప్లేట్లో పెట్టేసుకుని కూర్చున్నాడు

తినటానికి. అమ్మ స్టౌ మీద అన్నం దించేసి పాలు పెట్టింది. పెద్దన్నయ్య నోటిని అదుపులో పెట్టనందుకు ఇంతసేపూ కరుణ అమ్మ మీద యుద్ధం ప్రకటిస్తున్నాడు. వాడి ముందు పెట్టిన టిఫిన్ చల్లారి అట్లానే ఉంది. 'ముందు తిని మాటాడరా' అని అమ్మ బతిమాలుతున్నా వాడు వినిపించుకోవటం లేదు.

'వాడు నిన్నేమనకుండా చూస్తాలేరా. తిన్రా' అంది. వాడు మొండికేసి కూర్చున్నాడేగాని తిన్లేదు. ఆ రాత్రి అమ్మ ఎంతో ప్రాధేయపడితేనే గాని అన్నం తినలేదు వాడు. రాత్రి పదిగంటల సమయంలో పెద్దన్నయ్య వచ్చాడు. వాడిని అమ్మ తిట్టింది.

'నేనేమన్నానమ్మా? నన్ను తిడుతున్నావ్? రోజూ బడికి కలిసి పోతూండమన్నాను. అదే రేప్పొద్దున్న కూడా అంటాను. తప్పా చెప్పు?' అని పెద్దన్నయ్య అంతటితో ఆగక 'సర్లే, వెధవా నీ గురించి కథ రాయకపోతానా?' అని భయపెట్టి అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

ఆ మరుసటి దినం కమల వచ్చింది. బడి వేళకి. కమల రాకముందే కరుణ వెళ్లిపోయాడు బడికి.

'వచ్చేటప్పుడు కలిసి రండి' అన్నాను.

మూడోరోజు సాయంత్రం.

కమల అమ్మగారు వచ్చారు. వస్తూ వస్తూ ఆమె అమ్మని 'వదినగారూ' అని పిలిచారు. దాంతో మాకు అల్లరి చేయటానికి కావలసినంత అవకాశం దొరికింది. ఆమె వచ్చేసరికి ఇంట్లో అంతా ఉన్నాం. (మా మోహన్ బెజవాడలో ఉన్నాడులెండి)

అమ్మ మా అందరినీ పరిచయం చేస్తూ —

'మాపెద్దబ్బాయి వాడు. కథల్రాస్తాడు. అన్ని పత్రికల్లోనూ పడుతుంటాయి. మీరు చూసే ఉంటారు.

'వాడు రెండోవాడు. మెడిసన్ మూడో యేడు చదువుతున్నాడు. మూడోవాడు వాళ్ల పిన్ని దగ్గరున్నాడు బెజవాడలో. వాడు తొమ్మిది. వారం పద్దినాల్లో వచ్చేస్తాడు. మా వనజ పియూసీలో యీ యేడే చేరింది. వీడు చిన్నవాడు. మీకు తెలుసనుకుంటాను. కమల చెప్పే ఉంటుంది' అంది దగ్గరున్న కరుణని తట్టి చూపుతూ.

అమ్మని విడిపించుకుని కరుణ మెల్లగా నాన్నగారి గదిలోకి వెళ్లిపోయాడు. నాన్నగారు పరీక్ష పేపర్లు దిద్దుకుంటున్నారు. కరుణ, పక్కనే కూర్చుని వీక్లీలోని

బొమ్మలు చూసుకుంటున్నాడు.

'అల్లుడా, రావోయ్ రా' అని అత్తయ్యగారు పిలిచారు.

'రారా అత్తయ్యగారు పిలుస్తున్నారు.' అని అమ్మ బతిమాలుతున్నది.

అత్తయగారు 'అల్లుడా' అని పిలవడంతో ఒకసారి కరుణ మొఖం చూశాం. వాడి చూపులు వాలిపోయాయి బలహీనంగా. దాంతో అమ్మ పిలుపు కూడా పట్టించుకోలేదు వాడు. అట్లాగే కూర్చున్నాడు. కదల్లేదు అక్కడ్నించి.

'మా అల్లుడికి మరీ సిగ్గయినట్టుంది.'

అమ్మ అంతలో కరుణని సమర్థించాలని 'వీడికి ఎక్కడలేని సిగ్గు' అంది.

వాడి సిగ్గు చూస్తే ముద్దొస్తుంది. ఆ చేష్టలతో ఆడుకో బుద్ధి అవుతుంది. అందుకే నాన్నగారి గదికెళ్లి 'రారా' అని చెయ్యి అందుకుని ఈడ్చుకురావాలని ప్రయత్నించాను. కాని మొండి కేశాడు. కదల్లా. ఇంకొంచెం పట్టుదల చూపి లాగితే ఏడిచేట్టున్నాడు. ఇంక లాభంలేదని నా ప్రయత్నం మాని నా మట్టుకు నేను బుద్ధిగా కూర్చున్నాను.

'మా అల్లుడు అలిగిపోయాడా?' అని నావేపు చూశారు అత్తయ్యగారు. కరుణ వేపు చూసి 'ఏం కావాలో చెప్పు అల్లుడూ? అత్తయ్య మీద అంత కోపం చూపితే ఎట్లా?' అంది లాలనగా.

'అత్తయ్యగారి మీద కాకపోతే ఇంకెవరి మీద అలుక చూపిస్తాడండీ' అన్నాను. ఆమె కలుపుగోలు ధోరణికి అమ్మసర్దుకోలేకపోతున్నది. ఆమె 'ఏమిటో వింత మనుషులు' అని ఆదిలోనే గొణుక్కోకుండా ఉండాలని కల్పించు కున్నాన్నేను.

అత్తయ్యగారు సన్నగా పొడుగ్గా ఆరోగ్యంగా ఉన్నారు. చీరకట్టులో అందముంది. ఎంచుకున్న చీర రంగులో నాజూకు తనముంది. నుదుట బొట్టు పెద్దగా ఉంది. కాఫీపొడి రంగుది. సన్నని బంగారు గాజులున్నాయి.

కరుణ నాన్నగారి గదిలో ఉన్నా తప్పలేదని అక్కణ్ణించి తప్పుకోవాలని బయటికి పోబోతుండగా ఒక్కసారి అత్తయ్యగారు తన హాస్యధోరణంతా మార్చేసి 'నాయినా, కరుణా! ఇటురా' అని వయసుకు మించిన గంభీరతతో పిలిచారు.

కరుణ వచ్చాడు.

'కలిసిపోదామని కమలంటే నువ్వు, ముందుగా బణ్ణించి వచ్చేశావట నిజమేనా?'

అత్తయ్యగారి కళ్లల్లో సత్యమున్నట్టుంది. అంచేతనే చూల్లేక తలదించు కున్నాడు. దోషి ఐనట్టుగా మొఖం చిన్నబోయింది.

'దానికి ఈ ఊరు కొత్త. ఆ బడికెళ్లే దారి కొత్త, నువ్వు ఉన్నావ్ గదా అని పంపిస్తే నువ్వేమో విడిచిపెట్టి వెళ్లిపోతున్నావాయె. రేపట్నించి బడికెళ్ల నంటోంది —— ఏం చేయమంటావ్ చెప్పు?'

దించిన మొఖం ఎత్తలేకపోతున్నాడు.

'రేపట్నించి కమలతో పాటే వెళ్లడం, కమలతో పాటే రావడం. మరి మీరేం బాధ పడొద్దండీ' అన్నాను.

ఆ క్రింది చూపుల్తోనే నా వేపు కొర కొరా చూశాడు వాడు.

కాఫీచేసి తెమ్మని అమ్మ కళ్లతో చెప్పింది. దాంతో నేను వంటగదికి వెళ్లిపోయాను. తిరిగి కాఫీతో వచ్చేసరికి కరుణ లేడక్కడ. అమ్మ, అత్తయ్యగారు బంధుత్వాలూ,స్నేహితులూ మొదలయిన సంగతులేవో మాటాడుకుంటున్నారు. ఆ సత్యవతీ దేవి ఎవరో, ఆ ముకుందంగారి పెద్దమ్మాయి శకుంతల ఎవరో, ఆ కృష్ణకుమారి ఎవరో నేనెరగను.

కరుణని ఎట్లా అమ్మ ఒప్పించిందో ఏమోగాని రెండోదినం కమల వచ్చేవరకు వాడు ఆగి వచ్చాకా కలిసి వెళ్లాడు. ఇద్దరూ కలిసేవచ్చారు.

ఓ రోజు కమల బడినించి వచ్చేటప్పుడు పెద్దన్నయ్య ఆ పాపని మంచి మాటలతో వంటగదికి తీసుకుపోయి పాలు కలిపి ఇచ్చాడు తాగమని. అక్కడే కూర్చున్న కరుణ ముఖంలో భావాలు రంగులు మార్చుకున్నాయి. కమలని నేనో, అమ్మో తీసుకెళ్తే వాడంత బాధపడేవాడు కాదనుకుంటాను. కమలను పెద్దన్నయ్య తీసుకుని వెళ్లేసరికి తనని ఏడిపించటానికే అనుకున్నాడు.

కమల చింతపువ్వుల పరికిణీ, జాకెట్టు తొడుక్కుంది. సన్నగా కొనలు సాచుతోన్న లతలా పెరిగింది. చెంపకి చేరడేసి కళ్లు. ఆ చూపుల్లో నమ్మకమూ, ప్రేమా కనిపిస్తున్నాయి. చేతికందే సన్నని కంఠం. మనుషుల్లో తెల్లగా ఉంటారంటారే ఆ తెలుపు. ముక్కు చిన్నగా చూపులని లాక్కునేటంతటి అందంగా ఉంది. అత్తయ్యగారు తన ప్రేమనంతటిని చూపించి కూతుర్ని ముస్తాబు చేసినట్టున్నారు. రెండు జెళ్లు. కళ్లకి కాటుక. నుదుట ఎర్రటి చిన్న బొట్టు గుండ్రంగా. ముద్దుగా చిన్న చెప్పులు. (ఈ వర్ణనంతా కథ దిద్దిపెట్టినప్పుడు పెద్దన్నయ్య చేర్చాడు.)

కొద్ది నిమిషాల తర్వాత అత్తయ్యగారు వచ్చి 'బాబ్జీ చెప్పాడు కమల ఇక్కడుందని' అని అమ్మతో 'ఏం కూర చేస్తున్నారొదినగారూ?' లాంటి ప్రశ్నలు వేసి కూతుర్ని తీసుకుపోయారు.

'పాలూ, పళ్లరసమూ టిఫిన్లూ పెట్టి కోడల్ని ఇప్పటినించే మంచి చేసుకుని మమ్మల్ని మరిపించేయాలను కుంటున్నావా వదినా', అన్నారు అక్కడికి నాలుగయిద్దినాల తర్వాత వచ్చినపుడు.

'రేప్పొద్దున్న అత్తారింట్లో ఉండాల్సిందేకాని కన్నారింట్లో కలకాలం ఉండిపోలేదు కదా. అందుకని ఇప్పట్నించి మంచి చేసుకోవాలనుకుంటున్నా నమ్మా' అంది నవ్వుతూ అమ్మ.

ఆ రకంగా బంధుత్వం కంటే బలమైన తియ్యని స్నేహం ఏర్పడింది.

ఓ రోజు బెజవాడనించి ఉత్తరం వచ్చింది. మోహన్‌ని కుక్క కరిచిందంట. హాస్పిటల్‌కి తీసుకువెళ్లి బాబాయిగారు ఇంజెక్షన్‌లు ఇప్పిస్తున్నారట. ఆ కబుర్లు ఆ ఉత్తరం చదివి బాధపడ్డాం. అమ్మకి వెళ్లి మోహన్‌ని చూడాలనయితే ఉందికాని చెల్లెలెక్కడ తనని దూరం చేసిందని అంటుందోనని భయపడి పోలేదు. ఆ మరుసటి దినం శశిరేఖ పుష్పవతి అయిందని ఉత్తరం వచ్చింది. దాంతో అమ్మ బయల్దేరాల్సి వచ్చింది.

అమ్మ వెళ్లిపోయిన మరుసటి దినం అత్తయ్యగారు వచ్చి 'ఎల్లుండి కమల పుట్టిన్రోజు పండగ' అని చెప్పారు. కరుణనీ అందర్నీ ఆహ్వానించారు.

కమల పుట్టిన్రోజు పండక్కి నేను, కాలేజీలో ఎస్సేరైటింగ్ కాంపిటీషన్ ఉండి వెళ్లలేకపోయాను. పెద్దన్నయ్య తన కొత్తకథని విశ్వనాథశాస్త్రి గారికి వినిపించాలని తెల్లారే వెళ్లి సాయంత్రం మూడుకి గాని తిరిగి రాలేకపోయాడు. నాన్నగారికి అస్సలు ఈ సంగతి చెప్పనేలేదు నేను. ఒంటరిగా కరుణ బడికి వెళ్లిపోయాడు.

కమల రాకముందే కరుణ బడికి వెళ్లిపోవటం, కమల కంటె ముందుగానో ఆలస్యంగానో బణ్నించి రావటం నేను పసిగట్టాను. వాడినడిగి కారణం తెలుసుకోలేక పోతున్నాను. ఈ మార్పు కాస్తా పెద్దన్నయ్యతో చెప్పాను.

అత్తయ్యగారు అమ్మ ఎప్పుడొస్తుందని అడిగారే తప్పించి అంతగా ఇంటికి రావటంలేదు. అమ్మ లేకపోవటం వల్లనే అత్తయ్యగారు రావటం లేదనుకున్నాను.

ఈ మార్పు ఎవరికీ అర్థంకాలేదు.

వెళ్లిన వారం దినాల తర్వాత అమ్మ తిరిగి వచ్చింది.

వ్యాసరచన పోటీలో నెగ్గిన సంతోషం పంచుకోవటానికి రజని నాతోపాటు వచ్చింది. కబుర్లు చెప్పుకుంటున్నాం.

'కరుణ అట్లా కూర్చున్నాడేం?' అంది రజని చెవిలో మెల్లగా.

పడగ్గది మంచం మీద ఏదో కోల్పోయిన వాడిలాగ, చిగుళ్లు కోసేసిన మొక్కలాగ కన్పించాడు. (ఈ వాక్యం పెద్దన్నయ్య కలిపిందే.)

వాడు అట్లా ఉంటానికి కారణముంది. రాత్రి అమ్మతో చెప్పాడు. అమ్మ ఉదయం అంట్లు తోముతూ చెప్పింది నాకు. రజనితో ఆ కారణం చెప్పడం నాకు ఇష్టంలేదు. నాకే ఇబ్బందిగా ఉంది. అంచేత 'పెద్దన్నయ్యో, అమ్మో ఏదో అనుంటారు' అనేశాను.

మరికొన్ని దినాలు పోయింతర్వాత ఓరోజు రజినే అంది. 'చూశావా వనజా, బాబ్జీ వాళ్లమ్మగారు ఎప్పుడూ ఇక్కడే (అత్తయ్య గారింట్లో) ఉంటున్నారు.' అని

'అవును.'

అప్పుడు —— ఇంక ఆపలేకపోయాను. 'చూడు, కమల పుట్టిన్రోజు పండక్కి మేం వెళ్లలేదని అత్తయ్యగారిక్కోపం. మన ఇంటికి కమలను వెళ్లొద్దందట. ఆ రోజు నేను ఎట్లా వెళ్లడం రజనీ —— నీకు తెలుసు గదా —— నాకు ఎస్సేరైటింగ్ కాంపిటీషన్. అమ్మ బెజవాడ వెళ్లింది. పెద్దన్నయ్యతో చెప్పాను. వాడేమో శాస్త్రిగారి దగ్గరుండి పోయాడు. అమ్మ లేకపోవడంతో వచ్చిందంతా'

నాకు వెలితిగా ఉంది. అత్తయ్యగారు వచ్చి కబుర్లు చెప్పటం, పరిహాసాలు చేయటం, ఎంతో చనువుగా మంచిచెడ్డలు చెప్పుకోవటం, బంధుత్వాలు కలుపుకోవటం, ఇవన్నీ ఒక్కసారి పోయాయన్న బాధతో పాటు అంత సన్నిహితంగా ఉండేవాళ్లు ఇప్పుడేమొచ్చి దూరదూరంగా ఉంటున్నారని సహజంగా ఇరుగుపొరుగు అనుకుంటారు. వాళ్లలోనో మాలోనో దోషం చూపిస్తారు. మొదట్లో ఈ పరిచయం కోసం తాపత్రయ పడలేదు. అత్తయ్యగారే వచ్చారు. కమలే పిలిచింది వచ్చి. ఇప్పుడు ——

అమ్మ 'పోనీయవే, ప్రతిదానికీ బెంగపెట్టుకుంటే బతికినట్టే. వాళ్ల కిష్టముంది వచ్చారు. ఇప్పుడిష్టం లేదు రాలేదు. దానికి పెద్ద బాధెందుకు?' అని నన్ను సమాధాన పరచాలని అనేసింది కాని లోలోన ఇబ్బంది పడుతూనే ఉంది.

ఈ సంగతులేవీ రజనితో చెప్పదలచుకోలేదు. నా ఆత్మాభిమానం దెబ్బ తింటుంది. నా తమ్ముడు ప్రైజు సంపాదించుకున్నాడన్నప్పుడు పొందిన సంతోషం వేరు. అది నేను ప్రకటించకుండా ఉండలేను. నా తమ్ముడు ఫేలయ్యాడన్నది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా తప్పు.

సరే అత్తయ్యగారిని ఏమాకర్షించింది బాబ్జీలో? కరుణ కంటే బాబ్జీ

తెలివైనవాడేం కాదు. క్లాసులో కరుణకున్న మంచి స్థానం కూడా బాబ్జీకి లేదు. కరుణ స్నేహాన్ని కోరి వచ్చారు. వాడి స్నేహం కోల్పోయినందుకు వాళ్లు బాధపడాలికాని నేను కాదు. మా కరుణ చాలా మంచివాడు అవుతాడు. చాలా గొప్పవాడు అవుతాడు. నేనేకాదు వాళ్ల టీచర్ శ్యాంగారు కూడా అదే చెప్పారు. ఎవరన్నా ఆ సంగతి చెప్పగలరు.

* * *

వారం దినాలు గడిచాయి. కరుణ ఎప్పటి ఉత్సాహంతోనే ఉన్నాడు. కమల బాబ్జీ కలిసే వస్తున్నారు. ఆటలకి కలిసే పోతున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు. పెన్ను పోయిందనీ, పుస్తకాలు కావాలనీ, క్లాసులో ఎవరో కొట్టుకున్నారనీ, టీచర్ ఏదో తప్పు చెప్పాడనీ, హెడ్మాష్టరు నత్తిమాటలు ఇలా ఉంటాయనీ, స్కూల్లో పూలమొక్కలకు నీరుపోసింది ఎవరనీ ---- ఏవేవో —— నాకు చాల ఇష్టంగా ఉండే సంభాషణలు వింటున్నాను.

ఆ మధ్య----

ఒకరోజు అత్తయ్యగారు వచ్చి, 'సత్యనారాయణ వ్రతం చేస్తున్నానొదిన గారూ. కమల పుట్టిన్రోజున రాలేకపోయారు. ఇప్పుడు అలా వీల్లేదు' అని గతంలో అసలు ఏమీ జరగనట్టుగా చాలా తెలివిగా ఆహ్వానించి వెళ్లారు.

అమ్మ ఎప్పటి ధోరణిలోనే ప్రవర్తించింది.

మా అమ్మని చూస్తే నాకు నవ్వొస్తుంది. ఒత్తి పిచ్చిది. ఇతర్ల తాలూకు ఉద్దేశాలూ, ఊహలు తనకి పట్టవు. అర్థం చేసుకోదు. వాళ్ల ప్రయోజనాలూ, వాళ్ల గొప్పతనాలు ఏదో రకంగా వ్యక్తం చేసుకోవాలనే ప్రయత్నాలేవీ గుర్తించలేదు.

ఎందుకు ఈ వివరణ ఇస్తున్నానంటే ఆ రోజు సత్యనారాయణ వ్రతానికి వెళ్లినప్పుడు బాబ్జీ అమ్మ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు గారి భార్య)గారూ, మరికొందరూ, అత్తయ్యగారంటే వారుచూపుతున్న గౌరవాభిమానాలు, ప్రేమాదరణలు, ఆమె స్వల్పకాలంలో సంఘంలో సంపాదించుకున్న పలుకుబడిని ప్రకటించే ప్రయత్నం జరిగింది. నిజానికి బాబ్జీ అమ్మగారు ఒకసారి ---- బాబ్జీ సాయంత్రం ఎనిమిదింటి వరకూ రాలేదని తెలిసినప్పుడు —— వచ్చి అమ్మతో పరిచయం చేసుకున్నదే. కాని ఆమెకి అమ్మతో పరిచయానికీ, స్నేహానికీ ఆకర్షణలు ఏవీ కనిపించలేదు. అమ్మకి క్లబ్బులూ, మహిళా సమాజాలూ తెలీవు. జడ్జీల భార్యలతోనూ, లాయర్ల భార్యలతోనూ, ఆ పట్టణంలో ఉన్న 'దిసోకాల్డ్ హై క్లాస్ పీపుల్'తో నూ సంబంధాలు

లేవు అమ్మకి. వాళ్ల గొప్పతనం గురించిగానీ వాళ్లు సంఘానికి చేస్తున్న అపారమైన సేవ గురించిగానీ తెలీదు అమ్మకి.

అసలు అత్తయ్యగారు చేసే వ్రతాలకీ, పండుగలకీ వెనుక సామాజిక ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. అదే రజని కూడా గుర్తించింది. అప్పుడు అనిపించింది. అత్తయ్యగారు మొదట్లో అంత దగ్గరైపోవటానికీ, తర్వాత పలకరించకుండా మరచిపోవటానికీ, మళ్లీ అసలు ఏమీ జరగనట్టు వచ్చి పలకరించటానికీ అక్కడే అర్థం ఉంది.

ఆ రోజు వర్షం పడింది. ఆ వర్షంలో బడినించి వస్తున్న పిల్లలంతా పరుగు తీసుకుంటూ వచ్చారు. ఆ పరుగులో ఏదో ఆకుమీద జోడుతో ఉన్న కాలు జారి ప్రక్కనే ఉన్న లైట్ స్థంభానికి తల తగిలి కొద్దిలో సైడుకాలువలో పడిపోయే ప్రమాదం తప్పింది కమలకి. ఇప్పుడు కమల హాస్పిటల్‌లో గాయాలతో ఉంది.

'ఓ సారి చూసి వద్దామమ్మా' అన్నాను అమ్మతో. ఎందుకో నాకు భయంగా ఉంది. చిన్న పిల్ల. ముద్దు మాటలు. నచ్చే ప్రవర్తన. కమల గాయాలతో ఎలా ఉందో చూడాలని బుద్ధిపుట్టింది. అమ్మని రమ్మన్నాను. సాయంత్రం విజిటింగ్ అవర్స్‌లో వెళ్లేసరికి చిల్డ్రన్‌వార్డ్‌లో ఎడమకాలుని పైకి ఎత్తికట్టి చిన్నమంచం మీద కమలని పడుకోబెట్టారు. తలమీద గాయాలకి పెద్ద కట్లున్నాయి.

తీసుకువెళ్లిన పళ్లు కమలకి వొలిచిపెట్టాను. కమల తింది. మాట్లాడింది. మరో వారందినాల తర్వాత వచ్చేయటానికి వీలుంటుందని అత్తయ్యగారు చెప్పారు. ఆమె కళ్లల్లో బాధ.

అత్తయ్యగారు చెప్పిన విషయాల్లో చాలాముఖ్యమైన విషయం ఏమిటంటే 'ఇన్‌స్పెక్టరుగారి భార్య (అంటే బాబ్జీ తల్లి) మేజిస్ట్రేట్ గారి అబ్బాయి పుట్టినరోజు పండక్కి వాళ్ల అబ్బాయికి చాలా ఖరీదయిన గిఫ్ట్‌కొని ప్రజెంట్ చేసారట. అని చెప్పి, ఇంకా ఏదో చెప్పబోయి ఆగిపోయారు. ఆ చెప్పబోయినదేదో ఆమె మీద నిందలాంటిది అయివుండాలనిపించింది. లంచాల వలన వచ్చిన డబ్బేకదా, ఇచ్చే ప్రజెంట్‌కి ప్రతిఫలం కూడా ఉండాలి కదా లాంటి మాట ఏదో ఆమె మనసులో మెదిలి చెప్పటానికి ధైర్యం చాలక ఊరుకున్నారామె. బాబ్జీ తల్లి రాలేదనీ, మనషులంటే ఏమిటో కష్టాల్లో ఉన్నప్పుడే తెలిసొస్తుందనీ ఆమె వివరించారు.

వచ్చేస్తున్నప్పుడు ——

'వదినగారూ, రేపు మీరు వచ్చేటప్పుడు కరుణని కూడా తీసుకురండి" అన్నారు.

కమల భాష అర్థం కానట్టుగానే చూసింది. ఇంకా బాధ తీవ్రత తగ్గలేదు.

వచ్చేస్తుంటే మాతో పాటు వార్డ్ దాటేంతవరకూ వచ్చారామె. ఆమె నడకలో ఇప్పుడు చురుకుదనం లేదు. ఆమె మాటల్లో ఇప్పుడు ఉత్సాహం లేదు. ఆమె చూపుల్లో ఇప్పుడు ఇతర్లని ఆకర్షించాలనే తాపత్రం లేదు.

ఓడిపోయానన్న దీనత్వమూ లేదు. దిగులూ లేదు.

అత్తయ్యగారిని చూస్తే నాకు జాలేసింది. సమాజంలో స్థానం సంపాదించుకోటానికి మనము చేసే ప్రయత్నాలు వ్యర్థమయ్యాయని ఆ నిమిషాన తెలిసినట్టయింది.

'మరచిపోరు కదూ' అన్నారామె.

దేన్ని మరచిపోరు కదూ అన్నారామె? కరుణను రేపు తీసుకురావటాన్ని మరిచిపోరు కదూ —— అనికాదు. ప్రేమాభిమానాలని చూపటం, ఈ ఓదార్పు నివ్వటం, సమాజంలో నిజమైన బంధుత్వాన్ని కలిగి ఉండటం, జీవితంలో స్నేహానురాగాలు పెంచుకోవటం అనిపించింది.

మేం వచ్చేస్తున్నప్పుడు లెక్చరర్‌గారు కనిపించి, పలకరింపు చూపు చూసి, తల దించుకుని తన భుజాన వేలాడుతోన్న ఫ్లాస్కుతో, తన చేతిలోని పళ్లతో లోపలికి వెళ్లిపోయారు.

ఆ రెండో దినం కరుణని తీసుకొని ఆస్పత్రికి వెళ్లినపుడు, కరుణని చూసి కమల చూపులు వికసించాయి.

'నా పూల మొక్కలకి ఎవరు నీళ్లు పోస్తున్నారు?' అడిగింది కమల.

'వర్షాలు పడుతున్నాయి కదా ఎవ్వరూ నీళ్లు పొయ్యడం లేదు.' అని చెప్పి 'రేపు మన క్లాసు పిల్లలంతా నిన్ను చూట్టానికి వస్తున్నా'రన్నాడు కరుణ.

ఆ మాట విన్నప్పుడు, కమల ముఖంలోని కాంతి చూసి అత్తయ్యగారు ఎంత ఆనందించారో!

(ఈ కథని ఇలా ముగిస్తే పెద్దన్నయ్య బాగా లేదన్నాడు. అనవసరంగా పెంచి నట్టుగా ఉందన్నాడు. 'మేం వచ్చినప్పుడు లెక్చరర్‌గారు కనిపించి' —— అన్న దగ్గర్నించి తీసేయ్యాలని తను ఎర్రగీతలు అడ్డంగా పెట్టాడు. ఇది కథగాదు. జీవితం. దీనికి ఆకర్షణీయమైన మలుపుని జీవితంనించి ఎన్నుకునే సామర్థ్యం నాకు లేకపోయింది. నువ్వే ముగింపు చెప్పకూడదురా —— అంటే 'అట్లా చెప్పను. కథలు రాయడం చెపితే వచ్చేది కాదు. తనే తప్పులు చేసి, దిద్దుకుని ఇతర్ల అభిప్రాయాలూ,

విమర్శలూ అర్థం చేసుకుని, కథలు చదివి అవి మంచివైతే ఎట్లా మంచివయ్యాయో, గొప్పవయితే ఎట్లా ఏ సంఘటనల వలన, ఏ పాత్రల వలన, ఏ ఇతివృత్తం వలన, ఏ శిల్పం వలన, ఏ రచనా విధానం వలన, ఏ భావాల కూర్పు వలన, ఏ మనస్తత్వ పరిశీలన వలన, ఏ సాహితీ అందాలు కనిపించి — అది — ఆ కథ ఆకర్షించిందో — ఆ రకంగా కథ సాధించిన ప్రయోజనమేమిటో — అర్థం చేసుకోవాలి. కథలు రాయడం స్వంతంగా నేర్చుకోవాలి. చెపితే, 'కథలు రాయడమెలా' అన్న పుస్తకాలు చదివితే రాదు' అన్నాడు. అవన్నీ తెలుసుకునేవరకూ, ఆ చిత్రికలన్నీ పెట్టి ప్రతిభావంతుడయిన శిల్పి చేసిన శిల్పంలాగ తయారయ్యేవరకు ఆగలేను కాబట్టి ఇది ఇంతే.)

* * *

*ఆంధ్ర సచిత్ర వారపత్రిక*

*15.7.66*